RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 291 | 12 శనివారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## భారత్--రష్యా ఆర్థిక బంధాలకు కొత్త ఊపు

- ఢిల్లీలో ఇన్నోప్రోమ్ కార్యక్రమంలో పాల్గొన్న మోదీ, పుతిన్
- ఇరు దేశాల కంపెనీలకు ఒకే వేదిక
- వ్యాపార భాగస్వామ్యాల విస్తరణకు ప్రాధాన్యం



**రాజధాని వాయిస్ న్యూఢిల్లీ :** భారత్--రష్యా మధ్య ఆర్థిక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహించిన 'ఇన్నోప్రోమ్' కార్యక్రమంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కలిసి పాల్గొన్న ఆయన, ఇరు దేశాల వ్యాపార సంబంధాలు కొత్త దశలోకి ప్రవేశిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత్, రష్యాలకు చెందిన అనేక ప్రముఖ సంస్థలు పాల్గొని పెట్టుబడులు, పరిశ్రమలు, సాంకేతిక సహకార అవకాశాలపై చర్చించాయి. ఇన్నోప్రోమ్ వేదిక ఇరు దేశాల వ్యాపార వర్గాలను ఒకే చోటకు తీసుకువచ్చిందని మోదీ పేర్కొన్నారు. పరిశ్రమలు, తయారీ రంగం, సాంకేతికత, మౌలిక వసతులు, ఇంధన రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. భారత్--రష్యా మధ్య వ్యాపార సంబంధాలు కేవలం వాణిజ్యానికి మాత్రమే పరిమితం కాకుండా వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చెందుతున్నాయని వివరించారు.రష్యాతో భారతదేశానికి ఉన్న సుదీర్ఘ స్నేహబంధం ఆర్థిక రంగంలోనూ ప్రతిఫలిస్తోందని ఆయన తెలిపారు. పరస్పర పెట్టుబడులు, సంయుక్త పరిశ్రమలు, సాంకేతిక మార్పిడి ద్వారా ఇరు దేశాలు లాభపడుతున్నాయని పేర్కొన్నారు. గ్లోబల్ ఆర్థిక పరిస్థితుల్లో సవాళ్లు ఉన్నప్పటికీ, భారత్--రష్యా సహకారం స్థిరంగా కొనసాగుతోందని అభిప్రాయపడ్డారు. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న వ్యాపార అనుసంధానం ప్రపంచ మిగతా 2లో..

## విద్యా వ్యవస్థ వైఫల్యాలపై రాహుల్ ఆందోళన

- యువతను నిరాశపరుస్తోందన్న కాంగ్రెస్ నేత
- పేపర్ లీకులు, అధిక ఫీజులపై విమర్శలు
- విద్యార్థుల అనుభవాలు పంచుకోవాలని పిలుపు



**రాజధాని వాయిస్ న్యూఢిల్లీ :** భారత విద్యా వ్యవస్థపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. లక్షలాది మంది యువత నిజాయతీగా కష్టపడుతున్నప్పటికీ, ప్రస్తుత విద్యా వ్యవస్థ వారిని నిరాశపరుస్తోందని విమర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని వాటికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న పేపర్ లీకులు, అధిక ఫీజులు, శిథిలావస్థకు చేరుతున్న మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. భవిష్యత్ తరాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన వ్యవస్థే వారిని వెనక్కి నెడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆశయాలు, కలలు నెరవేరేలా విద్యా వ్యవస్థ పనిచేయాల్సి ఉండగా, అనేక లోపాల కారణంగా యువత ఇబ్బందులు ఎదుర్కొంటోం దన్నారు.విద్యా వ్యవస్థలోని సమస్యలను సరిదిద్దాలంటే ముందుగా వాటిని ప్రత్యక్షంగా అనుభవిస్తున్న వారి స్వరాన్ని వినాలని రాహుల్ అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ అనుభవాలను తనతో పంచుకోవాలని కోరారు. ఈ మేరకు విద్యా వ్యవస్థలోని లోపాలకు సంబంధించిన వివరాలను అందించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ లింక్‌ను కూడా ఆయన పంచుకున్నారు. దేశవ్యాప్తంగా యువత సమస్యలను తెలుసుకునేందుకు మిగతా 2లో..

## గణేశ్ మండపాలకు 9 రోజుల ఉచిత విద్యుత్: మంత్రి గొట్టిపాటి

**రాజధాని వాయిస్ అమరావతి, సెప్టెంబర్ 11 :** వినాయక చవితి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గణేశ్ మండపాలకు ఈ ఏడాది కూడా 9 రోజుల పాటు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రకటించారు. సెప్టెంబర్ 14వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఉచిత తాత్కాలిక విద్యుత్ అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి గొట్టిపాటి ఓ ప్రకటన విడుదల చేశారు. అధీకృత గణేశ్ మండపాలకే ఉచిత విద్యుత్ వర్తిస్తుందని వెల్లడించారు.గ్రామీణ ప్రాంతాల్లో 3 కిలోవాట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి చెప్పుకొచ్చారు. పట్టణ ప్రాంతాల్లో 5 కిలోవాట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని తెలిపారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తున్నట్లు వివరించారు. అవసరమైన దరఖాస్తులు విద్యుత్ అధికారులకు సమర్పించాలని సూచించారు. విద్యుత్ భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని మంత్రి ఆదేశించారు. కనెక్షన్లు, వైరింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

## 18 వరకు సాధిక్‌ఖాన్‌కు రిమాండ్



**రాజధాని వాయిస్** అమలాపురం: కాకినాడకు చెందిన పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య, ఆయన అల్లుడు జగదీశ్వరరెడ్డి హత్య కేసులో నిందితుడైన సాధిక్‌ఖాన్‌కు మూడు రోజుల పోలీస్‌కస్టడీ శుక్రవారం ముగిసింది. దీంతో సర్పవరం పోలీసులు అమలాపురం కోర్టు ప్రాంగణంలోని కాకినాడ స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. నిందితుడికి ఈనెల 18 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ.. కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్, అమలాపురం ఒకటో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ (ఇన్‌ఛార్జి) ఎన్.ఉషాలక్ష్మీకుమారి తీర్పు ఇచ్చారు. అనంతరం సాధిక్‌ఖాన్‌ను రాజమహేంద్రవరం కేంద్రకారాగారానికి తరలించారు.

## రెండు డీఏలు విడుదల చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

**అమరావతి, సెప్టెంబర్ 11 :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛనుదారులకు రెండు డీఏలు విడుదల చేస్తూ ఏపీ ఆర్థిక శాఖ ఉత్తర్వులు (AP Govt) జారీ చేసింది. పెంచిన డీఏలను (DA) సెప్టెంబర్ జీతానికి కలిపి చెల్లించాలని పేర్కొంది. 1.82 శాతం డీఏను 2025 జనవరి 1 నుంచి చెల్లించనుంది. 20 నెలల బకాయిలు 2028 జనవరి, మార్చి, మే, జులైలో ఇవ్వనుంది. 2.73 శాతం డీఏను 2024 జులై 1 నుంచి చెల్లించనుంది. 26 నెలల బకాయిలు 2027 ఏప్రిల్, జూన్, ఆగస్టు, అక్టోబరులో జమ చేయనుంది. పింఛనుదార్లకు కూడా ఇదే షెడ్యూల్‌లో డీఏ బకాయిలు చెల్లించాల్సిందిగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్‌కుమార్ పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్

- షర్మిల ఆదేశాలతో మానిటరింగ్ కమిటీ ఏర్పాటు - రఘువీరారెడ్డికి చైర్మన్ బాధ్యతలు
- కాంగ్రెస్ విజయమే లక్ష్యమన్న షర్మిల - సీనియర్ నేతలకు కీలక బాధ్యతలు



**రాజధాని వాయిస్ అమరావతి, సెప్టెంబర్ 11 :** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మ కంగా తీసుకుంది. ఎన్నికల్లో పార్టీ ఉనికిని బలంగా చాటుకోవ డంతో పాటు గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని మరింత వేగవంతం చేయాలని నిర్ణయించిన ఆమె, రాష్ట్ర స్థాయిలో కీలక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎనిమిది మంది సీనియర్ నాయకులతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీని ప్రకటించారు.ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీకి ఉన్న అనుభవజ్ఞులైన నాయకత్వాన్ని - మిగతా 2లో..

## ప్రజా సంతృప్తే లక్ష్యం చంద్రబాబు

- కలెక్టర్లకు కీలక దిశానిర్దేశం చేసిన చంద్రబాబు
- పాలనలో ఏఐ, డీప్ టెక్నాలజీ వినియోగంపై ఫోకస్
- ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- సానుకూల దృక్పథం పెంచాలని అధికారులకు సూచన



**రాజధాని వాయిస్ అమరావతి, సెప్టెంబర్ 11 :** ప్రభుత్వ పాలనలో ప్రజా సంతృప్తే అంతిమ లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పాలనలో ఆధునిక సాంకేతికత వినియోగం, ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూల దృక్పథం పెంపొందించడం అనే మూడు కీలక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను వేగంగా పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ పథకాలు ప్రజలకు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు కనిపించినప్పుడే పాలనకు నిజమైన అర్థం వస్తుందని పేర్కొన్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు వచ్చే దరఖాస్తులను పూర్తి సంతృప్తికరంగా పరిష్కరించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచూ గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. ప్రతి నెల కనీసం నాలుగుసార్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే అనేక సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు.పాలనలో టెక్నాలజీ వినియోగానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలన్నీ టెక్నాలజీ ఇంటిగ్రేషన్‌తో పనిచేయాలని, ప్రతి రంగంలో డీప్ టెక్నాలజీని అమలు చేయాలని సూచించారు. దీని ద్వారా అదనపు అభివృద్ధి సాధించడంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని కూడా పెంచుకోవచ్చని చెప్పారు. - మిగతా 2లో..



## నేతన్న భరోసా దరఖాస్తుల్లో సడలింపు

- బ్యాంకు స్టేట్‌మెంట్ నిబంధన మినహాయింపు
- మాస్టర్ వీవర్ ధ్రువీకరణ పత్రం చాలు
- 50 ఏళ్లు నిండిన నేతన్నలకు పెన్షన్
- కీలక ప్రకటన చేసిన మంత్రి సవిత

**అమరావతి, సెప్టెంబర్ 11 :** నూతన నేతన్న భరోసా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే చేనేత కార్మికులకు ఊరటనిచ్చే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. నేతన్న భరోసా పథకంలో పెన్షన్ పొందేందుకు దరఖాస్తు చేసే వారు ఇకపై బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కీలక వివరాలు వెల్లడించారు. నేతన్నల నుంచి వచ్చిన వినతులు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. బ్యాంకు స్టేట్‌మెంట్ సమర్పణ కారణంగా అనేక మంది అర్హులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించిన ప్రభుత్వం నిబంధనలను సడలించినట్లు చెప్పారు. దీనివల్ల మరింత మంది - మిగతా 2లో..

## రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

- రూ.10,021 కోట్లతో ఐదు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులు
- 540 కిలోమీటర్ల మేర రైలు మార్గాల సామర్థ్య పెంపు
- దక్షిణాది రాష్ట్రాలకు మెరుగైన రైలు కనెక్టివిటీ
- ప్రాజెక్టులను స్వాగతించిన సోము వీర్రాజు



**రాజధాని వాయిస్ అమరావతి :** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి కొత్త శిఖరాలను చేరుకుంటోందని బీజేపీ నాయకుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.10,021 కోట్ల వ్యయంతో ఐదు కీలక రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపడం శుభపరిణామమని అన్నారు. ఈ ప్రాజెక్టులు దేశ ఆర్థికాభివృద్ధికి, రవాణా రంగ పురోగతికి దోహదపడతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టుల ద్వారా 540 కిలోమీటర్ల మేర రైల్వే మార్గాల సామర్థ్యం పెరుగుతుందని సోము వీర్రాజు పేర్కొన్నారు. అరక్కోణం--రేణిగుంట, వైట్‌ఫీల్డ్--బంగారుపేట, హోసూరు--ఓమల్లూరు, సేలం--కరూరు--దిండిగల్, సికింద్రాబాద్--కాజీపేట మార్గాల్లో మల్టీట్రాకింగ్, డబ్లింగ్ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ పనులతో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని తెలిపారు.ఈ ప్రాజెక్టుల వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దక్షిణ భారత రాష్ట్రాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. మొత్తం 17 జిల్లాలకు ప్రత్యక్ష ప్రయోజనం - మిగతా 2లో..

# ఎన్ఐఈఎల్ఐటీ క్యాంపస్‌పై యువత గళం

**– భూమన అభినయ్ పిలుపుకు విశేష స్పందన**
**– తిరుపతిలో శాశ్వత క్యాంపస్‌పై స్పష్టత కోరిన యువత**
**– విద్య, ఉపాధి అవకాశాలపై చర్చ**
**– తిరుపతి అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి**






**రాజధాని వాయిస్ తిరుపతి, :** తిరుపతిలో ప్రతిపాదిత ఎన్ఐఈఎల్ఐటీ (NIELIT) శాశ్వత క్యాంపస్ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ భూమన అభినయ్ ఇచ్చిన పిలుపుకు యువత నుంచి విశేష స్పందన లభించింది. రాజకీయాలకు అతీతంగా విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తిరుపతి అభివృద్ధికి సంబంధించి ఈ ప్రాజెక్టు కీలకమని పేర్కొన్నారు. తిరుపతిలో 15 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదించిన ఎన్ఐఈఎల్ఐటీ శాశ్వత క్యాంపస్, రూ.87.20 కోట్ల డీపీఆర్ పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని యువత డిమాండ్ చేసింది. ప్రాజెక్టు అమలులో జాప్యం ఎందుకు జరుగుతోందో వెల్లడించాలని కోరారు. తిరుపతి యువత భవిష్యత్తుకు ఈ సంస్థ కీలక అవకాశాలను అందించగలదని అభిప్రాయపడ్డారు.విద్య, పరిశోధన, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పరంగా ఎన్ఐఈఎల్ఐటీ క్యాంపస్ తిరుపతికి ఎంతో ఉపయోగకరమని యువత పేర్కొంది. ఈ తరహా సంస్థలు స్థానిక విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పిస్తాయని వివరించారు. అందువల్ల ప్రాజెక్టును వేగంగా అమలు చేయాలని కోరారు. అమరావతి అభివృద్ధిని వ్యతిరేకించడం తమ ఉద్దేశం కాదని యువత స్పష్టం చేసింది. అమరావతి అభివృద్ధి చెందడంతో పాటు తిరుపతి కూడా సమానంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్ష వ్యక్తం చేసింది. ప్రాంతీయ అభివృద్ధిలో సమతుల్యత ఉండాలని సూచించింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు తిరుపతి యువతకు మెరుగైన విద్యా, ఉపాధి అవకాశాలు అందించేందుకు ఎన్ఐఈఎల్ఐటీ క్యాంపస్ అవసంమని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తు తరాల కోసం ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వాన్ని కోరారు. తిరుపతి అభివృద్ధిలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించగలదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు, మాజీ మేయర్ డాక్టర్ శిరీషతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు. తిరుపతి యువత భవిష్యత్తు కోసం ఎన్ఐఈఎల్ఐటీ శాశ్వత క్యాంపస్‌పై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఈ-ఫైళ్ల పరిష్కారంలో నెల్లూరుకు ప్రథమ స్థానం

**– ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో రాష్ట్రంలో అగ్రస్థానంలో జిల్లా**
**– 100 శాతం డిస్పోజల్‌తో రికార్డు**
**– కలెక్టర్ హిమాన్షు శుక్లా పనితీరుకు ప్రశంసలు**
**– కలెక్టర్ల సదస్సులో అభినందించిన సీఎం చంద్రబాబు**



**రాజధాని వాయిస్ అమరావతి, సెప్టెంబర్ 11 :** ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో నెల్లూరు జిల్లా రాష్ట్రవ్యాప్తంగా ప్రథమ స్థానం సాధించింది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా నాయకత్వంలో ఈ-ఆఫీస్ వ్యవస్థ సమర్థవంతంగా అమలవడంతో ఫైళ్ల పరిష్కారంలో అత్యుత్తమ ఫలితాలు నమోదయ్యాయి. పరిపాలనా సామర్థ్యాన్ని పెంచే దిశగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో పెండింగ్ లేకుండా ఈ-ఫైళ్లను వేగంగా పరిష్కరిస్తూ 100 శాతం డిస్పోజల్ సాధించడం విశేషంగా నిలిచింది. సగటున కేవలం 5 గంటల 29 నిమిషాల్లోనే ఫైళ్లను క్లియర్ చేయడం ద్వారా నెల్లూరు జిల్లా రాష్ట్రంలోనే అత్యుత్తమ పనితీరును ప్రదర్శిం చింది. ఈ విజయంతో జిల్లా పరిపాలనకు ప్రత్యేక గుర్తింపు లభించింది.రెండో రోజు నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ-ఫైళ్ల పరిష్కారంలో నెల్లూరు జిల్లా సాధించిన ఫలితాలను అభినందిస్తూ కలెక్టర్ హిమాన్షు శుక్లాను ప్రశంసిం చారు. ప్రభుత్వ సేవల వేగవంతమైన అమలులో ఈ విధానం ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు సేవలు త్వరగా అందించాలంటే ఫైళ్ల పరిష్కార ప్రక్రియలో జాప్యం ఉండకూడదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లా అమలు చేస్తున్న విధానాలు ఇతర జిల్లాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని అధికారులు అభిప్రాయపడ్డారు. సాంకేతికతను సమర్థంగా వినియోగించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఈ-ఆఫీస్ వ్యవస్థ ద్వారా పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరగడంతో పాటు ఫైళ్ల కదలికపై నిరంతర పర్యవేక్షణ సాధ్యమవుతోందని పేర్కొన్నారు. ఫలితంగా నిర్ణయాలు వేగంగా తీసుకునే అవకాశం ఏర్పడిందని వివరించారు. ప్రజలకు సేవల అందజేతలో కూడా గణనీయమైన మెరుగుదల కనిపి స్తున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో అధికారుల సమన్వయం, నిరంతర పర్యవేక్షణ, సమయపాలన వల్లే ఈ విజయాన్ని సాధించగలిగినట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయి పనితీరును కొనసాగిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నట్లు సమాచారం.

# కార్యకర్తలే పార్టీకి బలం: కాకాణి

**– కావలిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం**
**– కార్యకర్తలకు ఐడీ కార్డుల పంపిణీ**
**– పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**




**రాజధాని వాయిస్ కావలి :** కావలి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాకాణి గోవర్ధన్ రెడ్డి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలు ప్రభుత్వ తీరుపై అసంతృప్తిగా ఉన్నారని, భవిష్యత్తులో దీనికి తగిన సమాధానం ఇస్తారని అన్నారు.ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల విషయంలో ప్రజలు నిరాశ చెందుతున్నారని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి గత పదేళ్లుగా కృషి చేశారని పర్వతరెడ్డి కొనియాడారు. అధికారంలో లేకపోయినా కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీని బలోపేతం చేస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో కూడా పార్టీ విజయానికి కార్యకర్తలే ప్రధాన బలమని పేర్కొన్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలను గుర్తించాలనే ఉద్దేశంతో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేకంగా ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు, గౌరవం కల్పించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని వివరించారు. సమావేశం అనంతరం నాయకులు కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని నేతలు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# నిమజ్జన ప్రాంతం పరిశీలన – పోలిచెరువు వద్ద ఏర్పాట్ల తనిఖీ

**రాజధాని వాయిస్ రాజంపేట, సెప్టెంబర్ 11 :** గణేష్ నవరాత్రుల సందర్భంగా గణేష్ విగ్రహాల నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను మన్నూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లింగప్ప శుక్రవారం పరిశీలించారు. మన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలిచెరువు నిమజ్జన ప్రాంతాన్ని రాజంపేట సబ్ కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన భద్రతా చర్యలు, ప్రజల సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలిచెరువు వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రాంతంలో బారికేడ్లు, లైటింగ్, తాగునీటి సౌకర్యాలు తదితర ఏర్పాట్లను పరిశీలించారు.

# 40 నిమిషాల్లో వృద్ధురాలిని గుర్తించిన తిరుపతి పోలీసులు



**రాజధాని వాయిస్ తిరుపతి, సెప్టెంబర్ 11 :** తప్పిపోయిన 80 ఏళ్ల వృద్ధురాలిని కేవలం 40 నిమిషాల్లో గుర్తించి ఆమె కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించిన ఘటన తిరుపతిలో చోటుచేసుకుంది. తిరుపతి వెస్ట్ పోలీసులు వేగంగా స్పందించి వృద్ధురాలి ఆచూకీ కనుగొనడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వృద్ధురాలు కనిపించకుండా పోయిన విషయాన్ని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలియజేయడంతో వెంటనే పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. అందిన వివరాల ఆధారంగా ప్రత్యేకంగా అన్వేషణ చేపట్టారు. వెస్ట్ పోలీస్ సిబ్బంది వివిధ ప్రాంతాల్లో గాలింపు నిర్వహిస్తూ, అందుబాటులో ఉన్న సమాచారాన్ని సమన్వయం చేసుకుని వృద్ధురాలి ఆచూకీని గుర్తించారు. కేవలం 40 నిమిషాల వ్యవధిలోనే ఆమెను సురక్షితంగా గుర్తించడం విశేషంగా నిలిచింది. గుర్తించిన అనంతరం వృద్ధురాలి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆమెను కుటుంబ సభ్యుల వద్దకు తీసుకువచ్చారు. అనంతరం ఆమెను భర్తకు సురక్షితంగా అప్పగించారు. పోలీసుల తక్షణ స్పందన, సమర్థవంతమైన చర్యల వల్ల వృద్ధురాలు క్షేమంగా కుటుంబ సభ్యులను చేరుకోవడం సాధ్యమైందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భద్రత, సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అప్రమత్తంగా పనిచేస్తున్నామని తిరుపతి పోలీసులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

# స్థానిక ఎన్నికలపై రఘురామ్ ఫోకస్

**– రఘురామ్ ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ సమావేశం**
**– పార్టీ సభ్యులకు ఐడీ కార్డుల పంపిణీ**
**– స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపు**
**– డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ డిమాండ్**





**రాజధాని వాయిస్ తాడేపల్లిగూడెం :** తాడేపల్లిగూడెం పట్టణంలోని గమిని ఫంక్షన్ హాల్లో వైఎస్సార్సీపీ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ సభ్యులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేయడం లక్ష్యంగా ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వంక రవీంద్ర నాథ్, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వడ్డీ రఘురామ్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. "వెన్నుపోటు పార్టీ.. వెన్నుపోటు పాలన" కార్యక్రమం ద్వారా గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రస్తుత పాలన మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించినట్లు చెప్పారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు విస్తృత కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోందని, ప్రతి కార్యకర్త ఐక్యంగా పనిచేయాలని రఘురామ్ నాయుడు పిలుపునిచ్చారు. 2014లో అధికారంలోకి రాకపోయినా కార్యకర్తలు నిరుత్సాహపడలేదని, అదే ఐక్యతతో పనిచేసి 2019లో ఘన విజయం సాధించామని గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని, కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ప్రతి అర్హుడికి సంక్షేమం అందించామని పేర్కొన్నారు. గతంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత బలంగా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన రఘురామ్ నాయుడు, రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. మట్టి, ఇసుక, మద్యం మాఫియాలు రాజ్యమేలుతున్నాయని, అధికార పార్టీ నాయకులు పోలీసు వ్యవస్థను అడ్డుగా పెట్టుకుని వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన 143 హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని, గ్రామాల్లో అధికార పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు.డీఎస్సీ నియామకాల వ్యవహారంపై కూడా రఘురామ్ నాయుడు తీవ్ర ఆరోపణలు చేశారు. డీఎస్సీలో నకిలీ సర్టిఫికెట్లు, తప్పుడు రిజర్వేషన్లు, భారీ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ దీనిపై సీబీఐతో నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మెరిట్ ఉన్న అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, యువత భవిష్యత్తును దెబ్బతీసే విధంగా నియామకాలు జరిగాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, పట్టణ, మండల స్థాయి నాయకులు, ఎంపీపీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమన్న ఎమ్మెల్యే

– ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించిన ప్రశాంతిరెడ్డి
– వివిధ మండలాల ప్రజలతో ముఖాముఖి
– సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు






**రాజధాని వాయిస్ కోవూరు, సెప్టెంబర్ 11 :** ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారం చూపించడమే ప్రజాప్రతినిధిగా తన ప్రధాన బాధ్యత అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వీపీఆర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలను ఆమె కలిసి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నేరుగా స్పందిస్తూ వినతులను స్వీకరించారు. ప్రజాదర్బార్‌కు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ వ్యక్తిగత సమస్యలతో పాటు గ్రామాలు, ప్రాంతాలకు సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాల అమలు, రెవెన్యూ సంబంధిత సమస్యలు తదితర అంశాలపై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. ప్రతి సమస్యను శ్రద్ధగా విని సంబంధిత వివరాలను నమోదు చేయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడం తనకు అత్యంత ప్రాధాన్యమని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా పనిచేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజాదర్బార్‌లో అందిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట నేరుగా అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా కృషి చేయాలని అధికారులకు సూచించినట్లు వెల్లడించారు.నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఉన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజాదర్బార్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకునే అవకాశం లభిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు, వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

## దాహం దప్పిక తీర్చండి మహాప్రభో



రెంటచింతల.సెప్టెంబర్ 11 రాజధాని వాయిస్ : మల్లవరం గ్రామంలోని ఎస్సీ కాలనిలో నెలకొన్న మంచి నీటి ఎద్దడిని నివారించాలని కోరుతూ దళిత నేత మదర్ ఫౌండేషన్ అధ్యక్షులు జె.బాబురావు నేతృత్వంలో శుక్రవారం ఎంపీడీవో స్వరూపరాణికి వినతిని అందచేశారు. ఆ కాలనిలో నివశించే వారంతా కూలీ నాలీ చేసుకునే నిరుపేదలని త్రీఫేజ్ మోటార్ చెడిపోవడం వలన నీరు వచ్చే పరిస్థితి లేదని ఆ వినతిలో పేర్కొన్నారు. తక్షణమే మంచి నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ వినతిని అందచేసిన వారిలో సాగర్,ఏసోబు, కిషోర్ తదితరులున్నారు.

## వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

**సీఐ ఏ.భాస్కర్, ఎస్సై యం. వాసు**



కారంపూడి.సెప్టెంబర్ 11రాజదాని వాయిస్ : వినాయక చవితి పండుగ సందర్భంగా కారంపూడి మండలంలో మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలు ప్రతిష్టించే వారు తప్పనిసరిగా ముందస్తు పోలీసుల అనుమతి తీసుకోవాలని సీఐ ఏ.భాస్కర్, ఎస్సై యం. వాసు సూచించారు. ఉత్సవ కమిటీలు ఉచిత సింగిల్ విండో విధానంలో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కారంపూడి సర్కిల్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ, మండపాల ఏర్పాటుకు స్థల యజమాని, పంచాయతీ, అనుమతులు, ఫైర్, విద్యుత్ శాఖల నిబంధనలు పాటించాలని సూచించారు. రహదారులకు, ట్రాఫిక్ ఇబ్బంది కలిగేలా మండపాలు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదన్నారు. లౌడ్ స్పీకర్లు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని, డీజేలు, మందుగుండు సామగ్రి వినియోగించరాదని స్పష్టం చేశారు. నిమజ్జన సమయంలో మద్యం, మత్తు పదార్థాలు సేవిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## కన్నడలో మాదకద్రవ్య బేడ మాగా తెనాలిలో చిత్రీకరణ

**సినీదర్శకుడు దిలీప్ రాజా**



తెనాలి.సెప్టెంబర్ 11,రాజధాని వాయిస్ : కన్నడలో 'మాదకద్రవ్య బేడ మాగా 'టైటిల్ తో డ్రగ్స్ కు వ్యతిరేకంగా కర్నాటక రాష్ట్ర ధియేటర్లలో ప్రదర్శన నిమిత్తం ప్రచార చిత్రాన్ని గత రెండు రోజులుగా తెనాలిలో తెరకెక్కిస్తున్నట్లుగా సినీదర్శకుడు,మా-ఏపి వ్యవస్తాపకులు దిలీప్ రాజా తెలిపారు. స్థానిక ఆలపాటి నగర్ లోని మా-ఎపి ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, భాష వేరైనా భావం ఒక్కటేనన్నారు. భారత ప్రభుత్వం డ్రగ్స్ మహమ్మారి పై చేస్తున్న పోరాటంలో భాగంగా డ్రగ్స్ కు యువతరం బానిసలు కాకుండా ఉండేందుకు అవగాహనకోసం కన్నడ నటీ నటులతో చిత్రకరణ చేస్తున్నానని, పూర్తి స్థాయి సినిమా సాంకేతిక నిపుణులు ఈ కన్నడ ప్రచార చిత్రానికి పనిచేస్తున్నట్లుగా వివరించారు. తెలుగులో చిత్రీకరించిన 'డ్రగ్స్ వద్దు బిడ్డా'కు కన్నడ కథకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కర్ణాటకలోని ఒక యూనివర్సిటి స్టూడెంట్ డ్రగ్స్ కు బానిసయిన అనంతరం జరిగిన ప్రమాదకర పరిణామాల నేపధ్యమే ప్రధాన కథాంశమని ఆయన చెప్పారు. ఇశీదులో సహాన రాయ్,తనుశ్రీ, దర్శన్ మాలిక్ ,చేతన్ బాళిగ,అరసి నటిస్తున్నారని తెలిపారు.బుధ, గురువారాలు తెనాలిలో చిత్రీకరించగా మిగితా టాకి పార్ట్ బెంగుళూరుకో చిత్రీకరిస్తానని, నటి సహానా రాయ్ నటిస్తున్నారన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రజా వేదికలో వినతులు స్వీకరించిన తంగిరాల సౌమ్య
- అధికారులతో కలిసి సమస్యలపై సమీక్ష
- ప్రజల వద్దకే పాలన తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వం
- అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలుపై దృష్టి





**రాజధాని వాయిస్ నందిగామ:** ప్రజలకు పాలనను మరింత చేరువ చేసి, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ పట్టణంలోని ఆర్ఎస్ గార్డెన్స్లో నిర్వహించిన ప్రత్యేక స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలేఖ్యతో పాటు జిల్లా అధికార యంత్రాంగం, కూటమి నాయకులు పాల్గొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పించడం ద్వారా వాటి పరిష్కార ప్రక్రియ వేగవంతమవుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.గత ప్రభుత్వ హయాంలో ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన తీసుకెళ్తోందని తంగిరాల సౌమ్య అన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, అక్కడికక్కడే పరిష్కరించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల ప్రజలకు సమయం, వ్యయం ఆదా అవుతోందని పేర్కొన్నారు. నందిగామ నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు, పౌర సేవలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా పనిచేయాలని అధికారులను కోరారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు పెద్దపీట వేస్తూ నందిగామ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తంగిరాల సౌమ్య తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో నియోజకవర్గ అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు.

# ప్రజా దర్బార్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఉండి నియోజకవర్గంలో ప్రజా దర్బార్ నిర్వహించిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు
- ప్రజల సమస్యలను నేరుగా విన్న ప్రజాప్రతినిధి
- అధికారులకు తక్షణ పరిష్కారానికి ఆదేశాలు



**రాజధాని వాయిస్ ఉండి :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు శుక్రవారం సాయంత్రం ఉండి నియోజకవర్గంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వచ్చిన ప్రజలను కలిసి వారి సమస్యలను స్వయంగా విన్నారు. ప్రజలు వ్యక్తిగత, సామాజిక, మౌలిక సదుపాయాలు మరియు ప్రభుత్వ సేవలకు సంబంధించిన వివిధ సమస్యలను డిప్యూటీ స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.తక్షణ పరిష్కారం సాధ్యం కాని అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకురావడానికి అవకాశం లభిస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావడంలో ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రఘురామకృష్ణ రాజు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి సమర్థవంతమైన పరిష్కారాలు అందించేందుకు కృషి కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల స్థాయి ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచనలు జారీ చేశారు.

# టీడీపీ శ్రేణులకు ప్రత్యేక గుర్తింపు



**రాజధాని వాయిస్ గుంటూరు, సెప్టెంబర్ 11 :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేసిన తెలుగుదేశం పార్టీ శ్రేణులకు ప్రత్యేక గుర్తింపునిస్తూ వెలిగొండ ప్రాజెక్టు, శ్రీశైలం పర్యటనను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు చిరువ్యాపారులకు జీవనోపాధి కోసం మూడు తోపుడు బండ్లను అందజేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్ల నమోదు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతి డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి అర్హులైన పేదలను గుర్తించి దరఖాస్తులు చేసుకునేలా సహకరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.ఇటీవల నిర్వహించిన "ఇంటింటికి కూటమి ప్రభుత్వం -- సంక్షేమ విజయాలు" కార్యక్రమాన్ని విజయవంతం గా పూర్తి చేసిన బూత్ కన్వీనర్లు, బూత్ ఇన్‌చార్జీలు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేరవేయడంలో వారు చూపిన అంకితభావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. పార్టీ శ్రేణుల కృషికి గుర్తింపుగా సెప్టెంబర్ 13న ప్రత్యేక పర్యటన ఏర్పాటు చేస్తున్నట్లు గళ్ళా మాధవి వెల్లడించారు. డోర్ టు డోర్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తలు ఈ పర్యటనలో వెలిగొండ ప్రాజెక్టును సందర్శించడంతో పాటు శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.వెలిగొండ ప్రాజెక్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టికి ప్రతీకగా నిలిచిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి, లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రాజెక్టు ప్రాముఖ్యతను పార్టీ కార్యకర్తలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ పర్యటనను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు చురుకుగా పనిచేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల భూ హక్కులకు భరోసా

**రాజధాని వాయిస్ నెల్లిమర్ల, సెప్టెంబర్ 11 :** పూసపాటిరేగ మండలం కొల్లాయివలస పంచాయతీలో నిర్వహించిన 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేసి, భూ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ రైతుల భూ హక్కులకు సంపూర్ణ భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. భూములకు సంబంధించిన వివాదాలు, సమస్యలను పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన పూర్తి హక్కులు పొందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ ద్వారా భూ యాజమాన్యానికి చట్టబద్ధమైన రక్షణ లభిస్తుందని ఆమె అన్నారు. భూ రికార్డుల నిర్వహణలో ఆధునిక విధానాలను అమలు చేస్తూ రైతులకు మరింత సౌలభ్యం కల్పిస్తున్నామని తెలిపారు.రైతుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని లోకం మాధవి స్పష్టం చేశారు.

## పెద్ద కొదమగుండ్ల లైన్మెన్ గోపాల్ ఆకస్మిక మృతి



కారంపూడి సెప్టెంబర్ 11రాజ దాని వాయిస్ :దుర్గికి చెందిన విద్యుత్ శాఖ లైన్మెన్ గోపాల్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా గుండె పోటు తో మృతి చెందాడు.2004లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఆయన ప్రస్తుతం కారంపూడి మండలం పెద్ద కొదమగుండ్ల గ్రామంలో విధులు నిర్వహిస్తున్నారు.గ్రామంలో మూడు సంవత్స రాల నుండి గ్రామంలో సేవలందిస్తున్నారు.విధి నిర్వహణలో అందరి ఆదరాభిమానాలు పొందారు. మాచర్ల డీఈ సింగయ్య, ఏడీఈ ఆనందరావు భౌతికకాయానికి నివాళులర్పించి, అంత్యక్రియల ఖర్చుల కోసం కుటుంబానికి రూ.25 వేలు సాయం అందజేశారు. మృతి చెందిన లైన్మెన్ గోపాల్ కుటుంబానికి విద్యుత్ శాఖ వారు అండగా ఉంటామంటూ కుటుంబానికి భరో సా కల్పించారు. లైన్మెన్ గోపాల్ కుటుంబంలో ఒకరికి విద్యుత్ శాఖలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. యూనియన్ నాయకులు, సభ్యులు నివాళులర్పించారు.

## రేపు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ప్రమాణస్వీకారం



కారంపూడి.సెప్టెంబర్ 11రాజదాని వాయిస్ :మండల కేంద్రమైన కారంపూడి పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గా పలిశెట్టి శ్రీనివాసరావు ను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి పాల్గొని పరమాణస్వీకారం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కూటమి నాయకులు కార్యకర్తలు అందరు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

## నేడు ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన రూ.3.58 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**మాచర్ల.సెప్టెంబర్ 11 రాజధాని వాయిస్ :**నియోజకవర్గ పరిధిలో శనివారం మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి సుడిగాలి పర్యటన ఉంటుందని శుక్రవారం శాసన సభ్యులు వారి కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. కారంపూడి మండల కేంద్రంలో రూ. 42 లక్షల నిధులతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల నందు రూ. 50 లక్షల నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభిస్తారని, దుర్గి మండలం అడిగొప్పల శ్రీనిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి దేవస్థానం వద్ద రూ. 70 లక్షలతో వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకు, సంపు నిర్మాణ పనులు, రెంటచింతల మండలం గోలి గ్రామంలో రూ.1 కోటి 90 లక్షలతో నూతనంగా నిర్మించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొంది.

## చెకుముకి పరీక్షలతో విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీత



రెంటచింతల.సెప్టెంబర్ 11 రాజధాని వాయిస్ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో టాలెంట్ టెస్టులు ఎంతగానో దోహదపడతాయని ఎంఈవో-2 శివ నాగేశ్వరరావు అన్నారు. అదే సమయంలో విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకుని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఆయన సూచించారు. మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యూటీఎఫ్ నేతృత్వంలో, జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సామర్థ్య పరీక్షలను నిర్వహించారు.ఈ పరీక్షలకు మండలంలోని 12 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 700 మంది బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడం, సైన్స్‌పై ఆసక్తిని కలిగించడం లక్ష్యంగా పరీక్షలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. మండల స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన పాలువాయి జడ్పీ ఉన్నత పాఠశాల, శ్రీరామకృష్ణ గురుకులం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా కన్వీనర్ వీజే. రాజ్‌కుమార్, కత్తి రవి, అనిల్‌కుమార్, నరసింహారావు, సుబ్బారావు, రత్నకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com